ప్రజాశక్తి
సోమవారం 19, డిసెంబర్ 2022 5
శ్రీ సత్యసాయి



నేడు ఆటో యూనియన్ మహాసభ

ప్రజాశక్తి హిందూపురం

పట్టణంలోని సాయిరాం ఫంక్షన్ హాలులో సోమవారం ఆటో యూనియన్ మహాసభ నిర్వహిస్తున్నట్లు సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప తెలిపారు. మహాసభను పురస్కరించుకొని ఉదయం 10 గంటలకు సూగూరు ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఆటోలతో ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక సాయిరాం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఈ మహాసభలో ఆటోకార్మికుల సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. ఈ మహాసభలకు పలువురు ముఖ్యఅతిథులు హాజరవుతున్నారన్నారు. ఈ మహాసభలో ఆటోకార్మికులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈసందర్భంగా ఆయన కోరారు.



సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రు

జస్టిస్ చిన్నపరెడ్డి ఆదర్శనీయులు

నేటి తరం ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలి
ఆయన తీర్పులు నేటికీ శిరోధార్యాలే
శతజయంతి సభలో జస్టిస్ చంద్రు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

న్యాయ వ్యవస్థలో పనిచేసే వారెవరికైనా జస్టిస్ చిన్నపరెడ్డి ఆదర్శంగా నిలుస్తారని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రు పేర్కొన్నారు. జస్టిస్ చినపరెడ్డి శతజయంతిని పురస్కరించుకుని అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలోని డ్రామా హాలులో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది గురుప్రసాద్ అధ్యక్షతన జరిగిన 'రాజ్యాంగ విలువలు-చిన్నపరెడ్డి తీర్పులు' అన్న అంశంపై ఈ సదస్సు జరిగింది. కార్యక్రమం ప్రారంభానికి ముందు ఆయన చిత్రపటానికి జస్టిస్ చంద్రు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ప్రసంగించారు. చిన్నపరెడ్డి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా అనేక తీర్పులిచ్చారన్నారు. అందులో ప్రధానంగా నాలుగు అతి ముఖ్యమైనవిగా చెప్పుకోవచ్చునని తెలిపారు. ప్రస్తుతం మతమార్పిడుల విషయంలో పెద్దఎత్తున చర్చలు సాగుతున్న తరుణంలో ఆ తీర్పును ఉదంకించుకోవాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. అరవిందో కేసులో మత విశ్వాసాలపై ఒక కేసు ఆయన ముందుకొచ్చినప్పుడు ఇచ్చిన తీర్పు ఇప్పటి పరిస్థితులకు సరిగ్గా సరిపోతుందని చెప్పారు. మత విశ్వాసాలన్నవి వ్యక్తిగతమైనవని, ఎవరు ఏ మతాన్ని ఆచరించాలన్నా ఆచరించుకునే స్వేచ్ఛను రాజ్యాంగం కల్పించిందని గుర్తుచేశారు. కాని ఇప్పుడు కొన్ని రాష్ట్రాల్లో జిల్లా కలెక్టర్ల అనుమతులుండాలని చట్టాలు చేసియున్నారని తెలిపారు. కర్నాటకలో హిజాబ్ ధరించారని విద్యార్థినులను పరీక్షలకు అనుమతించకపోవడం వల్ల 20 వేల మంది విద్యకు దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ప్రభుత్వ రంగంలో రిజర్వేషన్లు, కాంట్రాక్టు విధానానికి వ్యతిరేకంగా ఆయనిచ్చిన తీర్పులు ఇప్పటి పరిస్థితులకు సరిపోతాయని వివరించారు. జాతీయగీతం ఆలపించే విషయంలో నిర్బంధంగా ఉండాల్సిన అవసరం లేదని తీర్పునివ్వడం అప్పట్లో పెద్ద చర్చనీయాంశమైందన్నారు. ఒకానొక దశలో ఆయనపై అభిశంసనకు సైతం వెళ్లి వెనుకడుగువేశారని పేర్కొన్నారు. ఇప్పుడు కూడా సినిమా హాళ్లలో నిర్బంధంగా అమలు చేయాలని చూసి, తరువాత ఆచరణలో వచ్చిన ఇబ్బందులతో ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారన్నారు. చిన్నపరెడ్డి ఏ మత విశ్వాసాలను తాను ఆచరించే వ్యక్తినికానని బాహాటంగా ప్రకటించియున్నారని తెలిపారు. ఆయనలాంటి వారు మరెందరో రావాల్సి ఉందన్నారు.

జిల్లా కోర్టులో విగ్రహం ఏర్పాటు చేయాలి : గురుప్రసాద్

జస్టిస్ చిన్నపరెడ్డి నంద్యాల ప్రాంతానికి చెందిన వారైనా ప్రాథమిక విద్య నుంచి గుత్తిలోనే కొనసాగడంతో ఈ జిల్లావాసీగానే భావిస్తున్నారన్నారు. ఆయన తీర్పులను పేద, సామాన్య ప్రజల కోణంలో ఆలోచించి ఇచ్చేవారని పేర్కొన్నారు. ఆయన లాంటి వ్యక్తులు న్యాయ వ్యవస్థలోనున్న నేటి తరానికి స్ఫూర్తిదాయకులని చెప్పారు. ఆయన జ్ఞాపకార్థం జిల్లా కోర్టు ఆవరణంలో ఆయన విగ్రహా ఏర్పాటు చేసి, నేటి తరానికి తెలియజేసే ప్రయత్నం చేసే విధంగా కృషి చేస్తామని చెప్పారు.

ప్రజల కోణంలో ఆలోచించి వ్యక్తి చిన్నపరెడ్డి
రామకృష్ణారెడ్డి, సీనియర్ న్యాయవాది

చిన్నపరెడ్డి ప్రజల కోణంలో ఆలోచించి తీర్పులిచ్చేవారన్నారు. ఎమర్జెన్సీ సమయంలోనూ లక్షలాది మందిపై పీడీ యాక్టును ప్రయోగించి జైళ్లలో పెట్టారని తెలిపారు. ఆ సమయంలో ఆయన ఇచ్చిన తీర్పు ఎంతో మందికి ఊరటనిచ్చిందన్నారు. పీడీ యాక్టు కింద కేసు నమోదు చేయబడిన వ్యక్తి గత చరిత్ర ఎలాగున్నా, ఇప్పుడు చూపిన కారణం సహేతుకంగా ఉందా లేదా అన్నదే ప్రధానమని తీర్పునిచ్చారన్నారు. ఆ నిర్ణయంతో తనతో సహా అనేక మంది జైళ్ల నుంచి బయటకు వచ్చారని గుర్తుచేసుకున్నారు.

పెట్రోల్ బంకుల్లో దోపిడీ..!

మానవ జీవితంలో పెట్రోల్ నిత్యావసర వస్తువుగా మారిపోయింది. ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాల సంఖ్య పెరిగే కొద్ది పెట్రోల్ బంకుల్లో తేడాలు కూడా అదే స్థాయిలో సాగుతున్నాయి. దీనివల్ల వినియోగదారుడు తీవ్రంగా నష్టపోతున్నాడు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అనేక పెట్రోల్ బంకుల్లో అంతర్గతంగా ఏర్పాటు చేసుకున్న కొలతల ద్వారా పరిస్థితి దయనీయంగా మారుతోంది. ఎక్కువ శాతం బంకుల్లో పెట్రోల్, డీజిల్ నాణ్యత పరీక్షకు సంబంధించిన పరికరాలు అందుబాటులో ఉండడంలేదు. కనీస సౌకర్యాలూ లేవు. పెట్రోల్ బంకుల్లో జరిగే మోసాలను వినియోగదారులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బంకుల్లో అంతర్గత కొలతల ఏర్పాటు
పట్టించుకోని అధికార యంత్రాంగం
నష్టపోతున్న వినియోగదారులు

ప్రజాశక్తి-హిందూపురం

అనంతపురం ఉమ్మడి జిల్లాల్లో పెట్రోల్ బంకులపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో యథేచ్ఛగా రీడింగ్ మీటర్‌ను ట్యాంపరింగ్ చేస్తూ కొన్ని పెట్రోల్ బంకుల యాజమాన్యాలు వాహనదారులను దోచుకుంటున్నాయి. గతంలో ఎన్నోసార్లు పెట్రోల్ బంక్ నిర్వాహకులు చేస్తున్న అక్రమాలను వాహనదారులు అధికారుల దృష్టికి తీసుకుపోయారు. నామమాత్రంగా చర్యలు తీసుకోవడం.. ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో విచ్చలవిడిగా పెట్రోలు దోపిడీ చేస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాల్లో 200 లకు పైగానే పెట్రోల్ బంకులు ఉన్నాయి. రోజుకు పెట్రోల్ 2.30 లక్షల లీటర్లు, డీజిల్ 1.50 లక్షల లీటర్లు పైగానే విక్రయిస్తున్నారు. వీటిని పౌరసరఫరాల శాఖ, తూనికలు, కొలతలశాఖ, రెవెన్యూ విభాగాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. తహశీల్దార్లు, ఆర్‌డిఒలు తరచూ తనిఖీలు చేయాల్సి ఉంది. అయితే వారు ఇతర కార్యకలాపాల్లో నిమగ్నమవుతూ తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పౌర సరఫరాల శాఖ అధికారులు కనీస సౌకర్యాలు, కల్తీ వంటి వాటిపై నిఘా ఉసేలేదు. దీంతో నిబంధనలు నీటిమీద రాతలుగా మారుతున్నాయి.

డిజిటల్ మీటర్లలోనూ అక్రమాలు

ప్రతి పెట్రోల్ బంకులో డిజిటల్ మీటర్లలోనూ అవకతవకలు ఉన్నట్లు కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్, డీజిల్ పోయించుకునేందుకు బంక్ వద్దకు వెళ్లినప్పుడు నిర్ణీత రుసుము రూ.10 పైసలు మొదలుకుని రూ.50 పైసల వరకు తక్కువకు మీటరు నిలిపివేస్తున్నారు. ఇలా చిల్లర పేరిట నెలకు సుమారు రూ.10 లక్షల వరకు వినియోగదారులు నష్టపోతుండడం గమనార్హం. డిజిటల్ మీటర్లలోనూ అక్రమాలు చోటు చేసుకోవడం విమర్శలకు తావిస్తోంది. సాఫ్ట్‌వేర్‌లో మార్పుల కారణంగా రూ.100, రూ.200 చొప్పున పెట్రోల్ కొనుగోలు చేసే వారు సైతం రూ.3 నుంచి రూ.5 చొప్పున నష్టపోతున్నట్లు తెలుస్తోంది. లీటర్లలో పెట్రోల్ లేదా డీజిల్ కొనుగోలులో వంద మిల్లీలీటర్ల వరకు తక్కువగా వస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డిజిటల్ మీటర్ల బిగింపులోనూ తూనికలు, కొలతల శాఖ అధికారులు యాజమాన్యాలు మరింత దృష్టి సారించాలని వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పెట్రోల్ బంకుల్లో సౌకర్యాలు మృగ్యం

అనంతపురం ఉమ్మడి జిల్లాల్లోని చాలా పెట్రోల్ బంక్‌ల్లో కనీస సౌకర్యాలు ఎక్కడా కానరావడం లేదు. నిబంధనల ప్రకారం తాగునీరు, గాలినింపే యంత్రం, మరుగుదొడ్డి ఏర్పాటు చేయాలి. విశ్రాంతి తీసుకునేందుకు వసతి ఏర్పాటు చేయాలి. ఈ మేరకు సెస్ వసూలు జరుగుతోంది. వాహనాలకు ఉచితంగా గాలి నింపే పరికరాలు తప్పనిసరి. టైర్లలో గాలి ఒత్తిడి సరిగ్గా లేకపోవడంతోనే ఇంధనం అత్యధికంగా వినియోగం అవుతుంది. డిజిటల్ మీటర్లను అన్ని అన్ని పెట్రోల్ బంకుల్లో బిగించాలని చమురు సంస్థలు గతంలోనే ఆదేశించాయి. ఇంకా కొన్ని బంకుల్లో పూర్తి స్థాయిలో డిజిటల్ మీటర్లను బిగించలేదు. 24 గంటలు బంకులు నిర్వహించాల్సి ఉండగా ఎక్కడా అమలు కావడం లేదు.



హిందూపురం పట్టణంలోని పెట్రోల్ బంకు

ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు

తూనికలు, కొలతల శాఖ అధికారులు ప్రతి సంవత్సరం తూకాలను పరిశీలించి సీల్ చేస్తారు. కంపెనీల ప్రతినిధులు కూడా కొలతలను పరిశీలించాలి. అన్ని పెట్రోల్ బంకుల్లో డీలర్ పేరు, ఫోన్ నెంబర్, డిఎస్ఒ సెల్‌ఫోన్ నెంబర్లు, వెబ్‌సైట్ అడ్రస్, టోల్‌ఫ్రీ నెంబర్ వినియోగదారులకు కనిపించేలా ఉండాలి. అన్ని బంకుల్లో హైడ్రోమీటర్, ఫిల్టర్ పేపర్, ఐదు లీటర్ల క్యాన్‌లు సిద్ధంగా ఉంచాలి. అనేక చోట్ల అందుబాటులో ఉంచడం లేదు. బ్లూ టూత్ ద్వారా తూకంలో మోసాలు చేస్తున్నారని తెలుస్తుంది. బంకుకు సంబందించిన భూమి వివరాలు, లీజ్ అగ్రిమెంట్, పట్టణంలో అయితే మున్సిపల్ సంస్థ అనుమతులను రెవెన్యూశాఖ పరిశీలించాల్సి ఉంటుంది. పౌరసరఫరాలశాఖ సరైన వసతులను, నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేయాలి. వాణిజ్య పన్నుల శాఖ వ్యాట్, వివిధ రకాల పన్నులను చూసి అనుమతించాలి. అగ్నిమాపక శాఖ ప్రమాదాల నివారణ చర్యలను పరిశీలించాల్సి ఉంటుంది. ఆయా శాఖలలో సిబ్బంది కొరత నేపథ్యంలో పూర్తి స్థాయిలో పర్యవేక్షణ కొరవడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఈ జాగ్రత్తలు పాటించాలి

వినియోగదారుడు పెట్రోల్, డీజిల్ పోయించుకునే సమయంలో తప్పనిసరిగా మీటరు జీరోలో ఉందో లేదో చూసుకోవాలి. మీటరు రీడింగ్‌ను పరిశీలిస్తూ పెట్రోల్, డీజిల్ పోయించుకోవాలి. రూపే మీటరుకు లీటరు మీటరుకు వ్యత్యాసం తెలుసుకోవాలి. ఇది తెలుసు కోకపోతే లీటరును రూపే మీటరు అని పొరబడే అవకాశం ఉంది. దీనివల్ల వినియోగదారుడు నష్టపోయే అవకాశం ఉంది. అందువల్ల తప్పనిసరిగా పెట్రోల్‌ను లీటర్ల రూపంలో పోయించుకోవాలి. పెట్రోల్ పోయించుకోవాలంటే 50, 100 అని రౌండ్ ఫిగర్ పోయించుకోకూడదు. సిబ్బంది ముందుగా తక్కువ కొలతతో ఫీడ్ చేసే అవకాశం ఉంది. వినియోగదారుడు 5 లీటర్ల క్యానులో పెట్రోల్ పోయించుకుంటే కాస్తయినా ఇలాంటి మోసాలను అరికట్టడానికి అవకాశం ఉంటుంది.



నియోజకవర్గ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రాబోయే ఎన్నికల్లో వైసిపిదే విజయం

నియోజకవర్గ సమీక్ష సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాబోయే ఎన్నికల్లో వైసిపిదే విజయమని ఆపార్టీ రీజినల్ కోఆర్డినేటర్, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కదిరి పట్టణంలోని అమృత కల్యాణ మండపంలో పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన వైసిపి నియోజకవర్గ సమీక్ష సమావేశానికి మంత్రి పెద్దిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను తీసుకొచ్చారన్నారు. 14 ఏళ్ల అధికారంలో ఉన్న చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు ఏ పథకాలు అమలుపరిచారో చెప్పాలన్నారు. భారతదేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా తీసుకునే విధంగా పరిపాలన సాగిస్తున్నారన్నారు. ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యత కల్పించారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి కార్యకర్తలు తిరుగులేని శక్తిగా ఎదగాలన్నారు. వైస్ జగన్మోహన్‌రెడ్డికి 175 స్థానాలు కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, మాజీ మంత్రి షాకీర్, మాజీ ఎంపీ నిజాం, మాజీ వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎస్‌ఎండి ఇస్మాయిల్, రాష్ట్ర సీఈసీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, జక్కల ఆదిశేషు, వాల్మీకి పాఠశాల అధినేత పవన్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్, మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, సర్పంచులు, పాల్గొన్నారు.

వైసిపి శ్రేణుల బాహాబాహి

కదిరి నియోజకవర్గ వైసిపిలో అసమ్మతి మరోసారి బగ్గుమంది. ఆదివారం కదిరి పట్టణంలోని అమృత ఫంక్షన్ హాల్ నందు నియోజకవర్గ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వైసిపి రాయలసీమ ప్రాంతీయ సమన్వయకర్త మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాకమునుపే స్థానిక ఎమ్మెల్యే వర్గీయులు, వైసిపి అసమ్మతి నేతలు కుర్చీలతో బాహాబాహికి దిగి రెచ్చిపోయారు. వైసిపి అసమ్మతి నేతలు వేదికపై ఉండటాన్ని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి అనుచరులు జీర్ణించుకోలేకపోయారు. గొడవపడ్డారు. ఒకరిపై ఒకరు కుర్చీలు విసురుకున్నారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరు గ్రూపుల వారిని నియంత్రించారు.

జిల్లాలో పరిశ్రమల కల్పనే ధ్యేయం

జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్
జి.నాగరాజారావు





ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో విరివిగా పరిశ్రమలు ఏర్పాటు చేసి పారిశ్రామిక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ జి.నాగరాజారావు పేర్కొన్నారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై ఆసక్తికర అంశాలను ఆయన ప్రజాశక్తికి వెల్లడించారు.

ప్రశ్న : జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలు ఏమి ?

జవాబు : జిల్లాలో ఔత్సాహికులు ముందుకు వచ్చి పరిశ్రమలు పెట్టదలుచుకునే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీతో కూడిన రుణాలు మంజూరు చేస్తున్నాయి. స్టాండ్ అప్ ఇండియా, ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం (పిఎంఇజిపి), చేనేత ముద్ర పథకం (ముద్రా స్కీం), ప్రధాన మంత్రి-సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం (పిఎంఎఫ్ఎంఇ) ద్వారా రుణాలను బ్యాంకుల ద్వారా పొందవచ్చు. లబ్ధిదారులు బ్యాంకు వారితో రుణ మంజూరు అంగీకారం పొందిన తరువాత, ప్రాజెక్ట్ రిపోర్టు తయారు చేసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ప్రశ్న : ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు ?

జవాబు : సూక్ష్మ, చిన్న తరహా, మధ్యతరగతి పరిశ్రమల నుంచి భారీ పరిశ్రమల వరకు ఏర్పాటు చేసుకోవచ్చు. తయారీ, సర్వీసింగ్, వ్యాపార యూనిట్లను మిశ్రమ రుణాల ద్వారా ఏర్పాటు చేసుకోవచ్చు. ఒక్కో పథకంలో ఒక్కో విధంగా రుణాలు, రాయితీలు ఉంటాయి. స్టాండ్ అప్ ఇండియా పథకంలో దరఖాస్తు చేసుకుంటే రుణ గ్రహీతకు రూ.10 లక్షల నుంచి రూ.కోటి వరకు బ్యాంకు రుణాలు పొందవచ్చు. గ్రానైట్, పల్వరైజర్స్, జీన్స్, రెడీమేడ్ గార్మెంట్, పేపర్ ప్లేట్స్, ప్లాస్టిక్ ఇండస్ట్రీస్, సిమెంట్ బ్రిక్స్, మచింగ్ సీట్స్, వక్క ప్లేట్లు, వక్క ఆకులు, హోటల్స్, ధాన్యం, టమోటా, గ్లూకోజ్ తయారీ, బనానా పౌడర్, పెయిటింగ్స్ తయారీ, వైట్ సిమెంట్, చేనేత, పవర్‌లూమ్స్, తీనెటీగల పెంపకం, పౌల్ట్రీ, పాడిశ్రమ మొదలైనవి పెట్టుకోవచ్చు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని పరిశ్రమలు ఉన్నాయి ? ఎన్ని ఉద్యోగాలు కల్పించారు ?

జవాబు : జిల్లాలో 20 భారీ పరిశ్రమలు ఉన్నాయి. రూ.5289 కోట్ల పెట్టుబడితో 7482 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాం. సూక్ష్మ, చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమలు 5677 ఉన్నాయి. రూ.1169.63 కోట్ల పెట్టుబడితో 37 వేల మందికి ఉద్యోగాలు కల్పించాం. ఈ ఏడాది రూ.377 కోట్లు కేటాయించారు. 108 యూనిట్లు మంజూరు అయ్యాయి. వాటిలో 51 యూనిట్లు గ్రౌండింగ్ అయ్యాయి.

ప్రశ్న : పరిశ్రమల ఏర్పాటుకు శిక్షణ ఇస్తున్నారా ?

జవాబు : అభ్యర్థులు వారు ఏర్పాటు చేయదలుచుకున్న పరిశ్రమ పట్ల కొంత అవగాహన కలిగివుండాలి. డిమాండ్, సప్లయ్ విధానంలోనే పరిశ్రమలు నడుస్తాయి. ఆ మేరకు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఏ పరిశ్రమ పెడితే అభివృద్ధి సాధించగలరో వారికి అంచనా ఉండాలి. మార్కెటింగ్ మెలకువలు కూడా తెలుసుకోవాలి. ఏర్పాటు చేసిన పరిశ్రమ నిర్వహణకు ప్రభుత్వం నుంచి కూడా శిక్షణ, అవగాహన కల్పిస్తాం. ముందస్తుగా కూడా కొన్ని పరిశ్రమల ఏర్పాటుకు ప్రచారాల ద్వారా చైతన్యం కల్పిస్తున్నాం. పరిశ్రమల శాఖ కేంద్రానికి వచ్చినా అధికారులను సంప్రదించి సమాచారం పొందవచ్చు.

ప్రశ్న : రాయితీలు ఎలా ఉంటాయి ?

జవాబు : ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళా, పురుషులు, వికలాంగులు, ఎక్స్‌సర్వీస్‌మెన్, మైనార్టీలు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే యూనిట్లలో 35 శాతం, పట్టణాల్లో 25 శాతం, రుణాలపై రాయితీ పొందచ్చు. యూనిట్ ఏర్పాటు కోసం లబ్ధిదారులు రూ.5 శాతం పెట్టుబడి వెచ్చించాల్సి ఉంటుంది. ఒసి మహిళా, జనరల్ అభ్యర్థులు గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతం, పట్టణాల్లో యూనిట్ ఏర్పాటు చేస్తే 15 శాతం రాయితీ ఉంటుంది. లబ్ధిదారుని వాటా యూనిట్‌లో 10 శాతం పెట్టుబడి వెచ్చించాల్సి ఉంది. యూనిట్ ఉత్పత్తి ప్రారంభించిన రోజు నుంచి పవర్ రిబిట్ యూనిట్‌కు రూ.1 ప్రకారం ప్రభుత్వం తిరిగి లబ్ధిదారులకు చెల్లిస్తుంది. వంద శాతం రీయింబర్స్‌మెంట్ ఆఫ్ జిఎస్ ఉంటుంది. క్రెడిట్ లింక్డ్ క్యాపిటల్ సబ్సిడీ స్కీంలో 25 శాతం మినషరీ కాస్ట్ మీద కేంద్ర ప్రభుత్వం నుంచి రాయితీ పొందవచ్చు. ఎపిఐఐసి ద్వారా కూడా ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ చేసి ఇస్తున్నారు. ఔత్సాహికులు పరిశ్రమలు పెట్టుకోవచ్చు.

ప్రశ్న : పరిశ్రమల ఏర్పాటుకు అనుమతి ఇస్తున్నారా? లక్ష్యం ఏమిటి ?

జవాబు : ప్రభుత్వం నుంచి ఇవ్వాల్సిన అన్ని అనుమతులు సింగిల్ డెస్క్ ద్వారా 21 రోజుల్లోగా ఇచ్చేస్తున్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, పరిశ్రమల శాఖ, అహుడా అప్రూవల్, జిఎస్‌టి శాఖ, అగ్నిమాపక, రిజిస్ట్రేషన్ ఇలా అన్ని శాఖలకు సంబంధించిన అనుముతులు పొందవచ్చు. పరిశ్రమల ఏర్పాటుకు విస్తారమైన అనువైన భూమి, సహజ వనరులు, రవాణా సౌకర్యం, మార్కెటింగ్, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు అధికంగా ఉన్న ప్రాంతం. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా స్థానికులకు ఉపాధి లభిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీతో కూడిన రుణాలు అందిస్తున్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. నూతన స్వయం ఉపాధి పథకాలు, సూక్ష్మ తరహా పరిశ్రమలు స్థాపించి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడం, సంప్రదాయ వృత్తి పని వారికి, గ్రామీణ, పట్టణాల్లో ఉన్న నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం.

ప్రశ్న : విద్యార్హత ఉందా? రుణమేళాలు నిర్వహిస్తున్నారా ?

జవాబు : తయారీ రంగంలో రూ.10 లక్షల పెట్టుబడి పైన పరిశ్రమ, సేవా రంగంలో రూ.5 లక్షల పెట్టుబడి పైన యూనిట్ స్థాపించే వారు 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. వయస్సు 18 సంవత్సరాలు పైబడిన వారై ఉండాలి. స్టాండ్ అప్ ఇండియా పథకం ద్వారా ఈ నెల 21న రుణ మేళా నిర్వహిస్తున్నాం. వెయ్యి యూనిట్‌ల లక్ష్యంతో రుణమేళా నిర్వహిస్తున్నాం. జిల్లావాసులు రుణమేళాను సద్వినియోగం చేసుకోవాలి. త్వరలోనే విశాఖ పట్టణంలో గ్లోబల్ ఇన్‌వెస్టర్స్ సమిట్ 2023ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. మరిన్ని పరిశ్రమలు రాబోతున్నాయి.

మూర్ఛవ్యాధి వైద్యశిబిరం

హిందూపురం : మూర్ఛవ్యాధితో ఇబ్బందులు పడేవారు ఒంటరిగా సంచరించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని జనవిజ్ఞాన వేదిక జోనల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఇటి రామ్మూర్తి అన్నారు. ఆదివారం పట్టణం ఆర్‌పిజిటి రోడ్‌లోని అల్‌హిలాల్ పాఠశాలలో జెవివి సహకారంతో మూర్ఛవ్యాధి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 163 మందికి వైద్యసేవలు అందించి, వారికి రెండు నెలలకు సరిపడు మందులు అందించారు. ఈ శిబిరంలో జెవివి సభ్యులు అతావుల్లా, అంజన్ రెడ్డి, రామకృష్ణ, లక్ష్మీపతి, నాగేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పొదుపులో కోత

నిబంధనల పేరుతో బ్యాంకర్ల వడ్డింపు
ఖంగుతింటున్న మహిళా సంఘాలు
నెలలో మూడు డిపాజిట్లు దాటితే కోతే..



చిలమత్తూరు మండల సమాఖ్య కార్యాలయం

ప్రజాశక్తి - చిలమత్తూరు

పొదుపు అంటే ఖర్చులు తగ్గించుకొని ఒక్కో రూపాయిని ఆదా చేసి జీవన ప్రమాణాలు పెంపొందించి ఆర్థికంగా బలపడటం. ఈ లక్ష్యాలను అందుకోవడానికి ప్రభుత్వాలు పొదుపు సంఘాలు, డ్వాక్రా సంఘాలు, వెలుగు సంఘాలు, మహిళ స్వయం సహాయక సంఘాలను ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టింది. పేరు ఏదైన లక్ష్యం పొదుపు చేయడమే. ఆర్థికంగా మహిళల అభ్యున్నతికి పెద్ద పీట వేయడంకోసం ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు రుణాలను మంజూరు చేస్తుంది. అయితే కాయ కష్టం చేసి ఇలా ఆదా చేసుకున్న సొమ్మును వారి వివో(గ్రామసంఘం) అకౌంట్ లలో జమ చేస్తారు. వాటికి వచ్చే వడ్డీ సొమ్ము, ఆదాచేసిన సొమ్మును ఇతర సభ్యుల కష్టసుఖాలకు అందజేసి, ఆ సొమ్మును సకాలంలో చెల్లించేలా చూసుకుంటారు. ఇదంతా గతంలో మాట. ఇప్పుడు ఆ సంఘాలకు బ్యాంక్ హ్యాండ్‌లింగ్ చార్జస్ పేరుతో కొత్త కష్టం వచ్చి పడింది. వీరి సొమ్ముతో బ్యాంకులు తమ ఆదాయం పెంచుకుంటున్నాయన్న విమర్శలు వినపడుతున్నాయి. దీంతో మహిళాసంఘాల పొదుపు నీటిమీద రాతగా మారిందన్న వ్యాఖ్యానాలు వినపడుతున్నాయి. మహిళ స్వయం సహాయక సంఘాలకు ఇప్పుడు వచ్చే వడ్డీ, ఆదా కథ దేవుడెరుగు డిపాజిట్ చేసిన డబ్బు కూడా పూర్తిగా జమాకాకుండ కమీషన్ పేరుతో కోత కోస్తున్నారని సభ్యులు లబోదిబోమంటున్నారు. ఇది కేవలం చిలమత్తూరు మండలానికే పరిమితం కాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితులు ఉన్నాయంటున్నారు కెనరా బ్యాంక్ నిర్వాహకులు. బ్యాంక్ నిబంధనలలో వచ్చిన మార్పుల వల్ల ఇలా అవుతుందని వారు అంటున్నారు.

డిపాజిట్ లలో కోత ఇలా...

కెనరా బ్యాంక్ నిబంధనల ప్రకారం నెలలో 3 సార్లు డిపాజిట్ చేసుకోవచ్చు. అది దాటితే ఇక కోతే. సాధారణంఆ ఒక్కో వివో క్రింద15- 40 వరకు చిన్న సంఘాలు ఉంటాయి. గ్రామ సంఘం పొదుపు, శ్రీ నిధి, సిఐఎఫ్ అప్పులు నెల వారీగా ఒక్కో సంఘం ఒక్కో రోజు చెల్లిస్తుంటుంది. సమస్య ఇక్కడే మొదలవుతోంది. అన్ని డబ్బులు మూడు సార్లు లోపే బ్యాంకుకు చేయడం సాధ్యపడదు. మహిళ స్వయం సహయక సంఘాల సభ్యుల ఆర్థిక పరిస్థితిని బట్టి వారి దగ్గర డబ్బుకు ఉన్నప్పుడు బ్యాంక్‌లలో వివో అకౌంట్‌కు జమ చేస్తారు. ఇలా జమా చేయడం ఎంత తక్కువ అనుకున్నా నెలలో పది సార్లకు పైబడే ఉంటుంది. మూడుసార్లు దాటితో నిబంధనల ప్రకారం ప్రతి డిపాజిట్‌కు రూ. 59 నుండి రూ.295 వరకు కట్ అవుతుందని అదికూడా డిపాజిట్ అమౌంట్ విలువని బట్టి కట్ అవుతుందని మహిళాసంఘాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమీషన్ పేరుతో ....

నెలలో మూడు సార్ల డిపాజిట్ దాటితే ఇక కోతే. పొదుపు సంఘాల వారు 100 రూపాయల నుండి పొదుపు డిపాజిట్ చేసేవారు ఉంటారు. తాము డిపాజిట్ చేసిన సొమ్ము సక్రమంగా అకౌంట్‌లో జమ అయిందనుకుంటారు. అయితే అందులో కూడా రూ. 59 కట్ అవుతుందని తెలిసిన మహిళాసంఘాల సభ్యులు అవాక్కవుతున్నారు. దీనిపై వారు ఎపిఒకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎపిఒ బ్యాంకు మేనేజరుతో మాట్లాడి లెటర్‌కూడా ఇచ్చారు. అయినా ప్రయోజనం లేదని తాము బ్యాంకు నిబంధనలు పాటిస్తున్నామని బ్యాంకర్లు చెబుతున్నారు.

ఒక్క క్లస్టర్‌లో కమిషన్ పేరుతో నగదు కోత పడిన వివరాలు...

అధికారుల లెక్కల ప్రకారం 2021-22లో చౌడేశ్వరి సంఘానికి చెందిన రెండు అకౌంట్ల నుండి రూ. 10738లు కమీషన్ పేరుతో కట్ అయింది. ఇక అల్లా మాలిక్ సంఘం నుండి రూ. 8673, అన్నపూర్ణేశ్వరి సంఘం నుండి రూ.11795, శ్రీ శక్తి సంఘం నుంచి రూ. 10660, ఈశ్వరి సంఘం నుంచి రూ. 1240, శ్రీ లక్ష్మి సంఘం నుంచి రూ. 9026, విజేత సంఘం రూ. 767 కట్ అయ్యాయి. ఇవన్ని ఒక్క క్లస్టర్ లోనివి(వివో)మాత్రమే. కేవలం ఒక్క సంవత్సరంలో 52,899 రూపాయలు కట్ అయ్యాయి. ఈ తరహాలోనే 2022-23 లో మరింత పెరిగింది. ఇలాంటివి మండలంలో 3 కస్టర్లు ఈ కెనరా బ్యాంక్ పరిధిలో ఉన్నాయి, ఈ లెక్కన 27 గ్రామ సంఘాలు ఉన్నట్లుగా అధికారులు తెలిపారు. ఇలా అన్ని సంఘాలు చూస్తే లక్షల రూపాయలలో కమీషన్ కట్ అవుతున్నట్లు తెలుస్తోంది. పొదుపు కాదు కదా బ్యాంకర్ల నిర్వాహకంతో తమ అప్పు కూడా తీరడం లేదని మహిళలు వాపోతున్నారు. ఇలా కమీషన్ పేరుతో పొదుపు సొమ్మునుంచి నగదు కట్ కావటంతో సంఘం నిర్వహణలోని లావాదేవీల్లో తేడాలు కన్పించి సంఘ సభ్యుల మధ్య సమస్యలు నెలకొంటున్నాయి. ఈనేపథ్యంలో సభ్యులపై భారం పెరుగుతు మహిళ స్వయం సహాయక సంఘాల నిర్వహణ కష్టతరంగా మారుతున్న పరిస్థితి నెలకొంది.

సంఘాల నిర్వహణ కష్టంగా ఉంది

మహిళా స్వయం సహాయక సంఘాల నిర్వహణ కష్టం అవుతుంది. ప్రభుత్వం వైపు నుండి ప్రోత్సాహం ఉన్న కెనరా బ్యాంక్‌లో ఉన్న వీవో ఖాతాలో జమ చేసే సొమ్ము బ్యాంక్ హ్యాండలింగ్ చార్జస్ పేరుతో కట్ చేస్తుండటంతో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. చిన్న సంఘాల పొదుపు పోయి అప్పులు మిగులుతున్నాయి. దీంతో చాల సమస్యలు ఏర్పడుతున్నాయి. సమస్యను మేనేజర్‌కు విన్నవించాము. వారు బ్యాంక్ నిబంధనలు అలా ఉన్నాయంటున్నారు. ఇలా అయితే సంఘాలు నడవడం కష్టం. ప్రభుత్వం చొరవ తీసుకొని మహిళ స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ నిబంధనల్లో మినహాయింపు ఇవ్వాలి.

భారతి ,
ఎపిఎం

భార్యను హత్య చేసిన భర్త

ఓబుల దేవర చెరువు : మండల పరిధిలోని వీర ఓబనపల్లిలో దారుణం చోటు చేసుకుంది. భర్త చేతిలో భార్య హతమైంది. గ్రామానికి చెందిన తులసమ్మ (31) ఆమె భర్త కేశవరెడ్డి చేతిలో హత్య గురైంది. మృతురాలి మేనత్త శాంతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు... తులసమ్మ, కేశవరెడ్డి గతంలో తిరుపతిలో ఉండేవారు. కేశవరెడ్డి ఎక్కువగా కోడిపందాల ఆడేవాడు. దీంతో గొడవలు జరిగి అక్కడి నుండి ఓడిచెరువు మండలానికి వచ్చారు. ఇక్కడ కూడా కుటుంబ కలహాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం భార్యభర్తలు గొడవ పడ్డారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి ఆగ్రహంతో తులసమ్మను కత్తితో పొడిచాడు. అది గమనించిన శాంతమ్మ గట్టిగా అరవటంతో కేశవరెడ్డి పారిపోయాడు. అప్పటికే తులసమ్మ మృతిచెందింది. ఇదిలా ఉండగా తులసమ్మ హత్యకు మరో కారణం ఉందని ప్రచారం జరుగుతోంది. తులసమ్మ ప్రవర్తన సరిగా లేదని, ఆమె వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని అది గమనించిన కేశవరెడ్డి తులసమ్మను హత్య చేశాడని స్థానికులు చర్చించుకుంటున్నారు. పోలీసుల దర్యాప్తులు నిజానిజాలు వెల్లడి కావాల్సిఉంది.

కారు బోల్తా

రొద్దం : మండల పరిధిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు బోల్తా పడింది. పెనుకొండ పావగడ ప్రధాన రహదారిలో ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో పెనుకొండ వైపు నుంచి వస్తున్న ముదిగుబ్బ కు చెందిన స్విఫ్ట్ కారు, పావగడ వైపు నుంచి వస్తున్న లారీని తప్పించబోయి బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ప్రమాదం జరగలేదు. కారు పూర్తిగా దెబ్బతింది. ప్రమాదానికి కారణమైన లారీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కొత్తచెరువు : కొత్తచెరువు సమీపంలోని నాగుల కణం వద్ద ఆదివారం సాయంకాలం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి పోలీసులు తెలిపిన మేరకు వివరాలు... పుట్టపర్తిలోని గోకులంకు చెందిన నరసింహులు, వెంకటరమణ, హరి కలసి కొత్త చెరువులో వివాహానికి హాజరై తిరిగి సొంత గ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. వీరి వాహనాన్ని పుట్టపర్తి వైపు నుండి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు.

టిడిపి నాయకుడి ఆటో దహనం

చెన్నేకొత్తపల్లి : రాప్తాడు నియోజకవర్గంలో గతంలో ఎప్పుడూ లేని విష సంస్కృతికి తెర లేపారని మాజీ మంత్రి పరిటాల సునీత విమర్శించారు. చెన్నేకొత్తపల్లి మండలం ముష్టికోవెల పంచాయతీలోని గువ్వల గోవిందంపల్లి గ్రామంలో టిడిపి నాయకుడి ఆటో దహనం సంఘటనపై ఆమె తీవ్రంగా స్పందించారు. గ్రామానికి చెందిన బీసీ నాయకుడు గోపాల్ ఆటోను గత రాత్రి గుర్తు తెలియని దుండగులు కాల్చి వేశారన్నారు. వైసీపీ నాయకులే ఈ ఘటనకు పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కాలిపోయిన ఆటోను ఆమె పరిశీలించారు. కొత్త ఆటో కొనుగోలు చేసేందుకు డౌన్ పేమెంట్ కింద 30వేలు ఆర్థిక సాయం చేశారు. రాప్తాడు నియోజకవర్గంలో గతంలో ఎప్పుడూ ఇలాంటి సంఘటనలు జరగలేదన్నారు. కేవలం తన పాదయాత్రలో పాల్గొన్నారన్న కోపంతో ఇలాంటి ఘటనలకు పాల్పడ్డారని ఆరోపించారు. గతంలో కూడా పాదయాత్రలో పాల్గొన్న వారి ఇళ్లకు వెళ్లి పోలీసులు, అధికారుల ద్వారా బెదిరింపులకు దిగారని ఆరోపించారు. చిన్న చిన్న అంశాలకే గ్రామాల్లో చిచ్చుపెట్టి ఇలా పెద్దవి చేయడం సరికాదన్నారు. ఇలాంటి ఘటనలకు ఆదిలోనే ముగింపు పలకాలని లేనిపక్షంలో ఇవి పునరావతం అయ్యే అవకాశాలు లేకపోలేదని అన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ఈ సంఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

కొత్తచెరువు : గణిత దినోత్సవం సందర్భంగా జన సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లాస్థాయి గణిత ప్రతిభా పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్, డిఇఒ మీనాక్షమ్మ పరిశీలించారు. కొత్త చెరువులో నిర్వహిస్తున్న ఆరు పరీక్ష కేంద్రాలను వారు పరిశీలించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు సత్యసాయి జిల్లావ్యాప్తంగా 232 పాఠశాలల నుండి 9, 10 తరగతిలో చదువుతున్న విద్యార్థులు 3 వేల మంది ఈ పరీక్షకు హాజరవుతున్నట్లు చెప్పారు. ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్, వెంకటరమణప్ప, శ్రీనివాసులు, శ్రీరాములు, హెచ్ఎం చెన్న కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు చంద్రబాబునాయుడు, ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచకపాలన : మాజీ ఎమ్మెల్యే

మడకశిర రూరల్ : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని మాజీ ఎమ్మెల్యే ఈరన్న విమర్శించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం కిందట పుంగనూరులో రామచంద్రయాదవ్ ఇంటిపై వైసిపి శ్రేణులు దాడి చేయడం అన్యాయమన్నారు. ఆ ఘటన మరువకముందే శుక్రవారం మాచర్ల టిడిపి నాయకులపై విచక్షణ రహితంగా దాడులు చేసి నాయకుల ఇళ్లను తగలబెట్టడం దారుణమన్నారు. అధికార మదంతో రాష్ట్రంలో అడ్డు అదుపు లేకుండా అరాచకాలు చేస్తున్నారని విమర్శించారు. టిడిపికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఓటమి భయంతో ప్రతిపక్షాలపై దౌర్జన్యాలు, దాడులు, తప్పుడు కేసులు, నిర్బంధాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇంత దారుణ సంఘటనలు జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండురంగప్ప, రవి భూషణ్, రాజగోపాల్, రమేష్, నరేష్, మంజు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ధర్మవరమే లక్ష్యం

ధర్మవరం టౌన్ : ధర్మవరాన్ని స్వచ్ఛ ధర్మవరంగా తీర్చిదిద్దుదామని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పేర్కొన్నారు. క్లాప్ క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక మున్సిపల్ ఛైర్‌పర్సన్ లింగంనిర్మల, కమిషనర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఇంటిలోని తడి, పొడి చెత్తను రోడ్డుపైకి పారవేయకుండా మున్సిపాలిటీ వారు అందించిన చెత్తబుట్టలలో వేరువేరుగా వేసి తరువాత మీ ఇళ్ల వద్దకు వచ్చే మున్సి పాలిటీ ఆటోలలో వేయాలన్నారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ వందశాతం జరగాలన్నారు. చెత్త సేకరణపై సచివాలయ, మెప్మా సిబ్బంది ద్వారా ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. డిసెంబరు 31వతేదీ నుంచి ప్లాస్టిక్ నిషేధం అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు భాగ్యలక్ష్మి, పెనుజూరు నాగరాజు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ధర్మవరం టౌన్ : క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దఢత్వం కలుగుతుందని యశోద పాఠశాల డైరెక్టర్ పృధ్వీరాజ్, ప్రభుత్వ పాఠశాల పీడీ అంజన్న పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవపురంలోగల యశోద కాన్సెప్ట్ స్కూల్లో ఆదివారం క్రీడాదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ పాఠశాల పీడీ అంజన్న హాజరై క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించాలన్నారు. ఈసంద ర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ క్రీడా విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

In the court of the Senior Civil Judge, Penukonda
H.M.O.P.No.50/2022

Between:
G.R.Anusha W/o Thallam Suman Krishna, D/o Guduru Rama Mohna ,aged about 34 years, Hindu, House Wife, 5-48, Main Road,Near Z.P.High School, Chennaraju palli, Kothacheruvu Mandal, Cell:9959571163
...petitioner

And

Thallam Suman Krishna, S/o Ranganatha Guptha, 35 years, Hindu, Business. residing at D.No:10-224, Adimurthy Nagar, Near Little Flower School, Ananthapuramu Town and District.
...Respondent

Notice To The Respondent

ఇందుమూలముగా రెస్పాండెంట్‌కు తెలియజేయడము ఏమనగా అర్జీ దారురాలు పై కోర్టులో విడాకుల కొరకు అర్జీదాఖలు చేసియున్నది. సదరు అర్జీలో నీకు ఎన్ని పర్యాయములు నోటీసు పంపిననూ తీసుకొనక కాలహారణ చేయుచున్నారు. సదరు అర్జీ మీ హాజరు నిమిత్తము 26-12-2022 వ తేదిన వాయిదా వేసినారు. కావున నీవు 26-12-2022 వ తేదిన ఉదయం 10:30 గంటలకు ఖుద్దున గాని, వకీలు ద్వారా గానీ హాజరై నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టువారికి తెలుపుకొనవలయును. లేని యెడల పై అర్జీ మీ పరోక్షమున తీర్మాణించెదరని ఇందు మూలముగా తెలయజేయడమైనది.

(By order of the court)

వాయిదా తేది: 26/12/2022

Sri.M.Bhaskar Reddy, M.A.,B.L
Sri.K.Aswartha Narayana,B.A.,L.L.B
Advocate For The Petitioner, Penukonda

ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్య సాయి జిల్లా డిఆర్‌డిఎ, వైకెపి, ఎల్ 1, ఎల్ 2, సిసి ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం స్థానిక డిఆర్‌డిఎ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లాలోని 50 మంది సీసీలు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా యూనియన్ సభ్యులు సి. రమేష్ రెడ్డి, సి. నాగార్జున పర్యవేక్షణలో ఎన్నిక నిర్వహించగా, శ్రీ సత్య సాయి జిల్లా ఎల్ 1, ఎల్ 2 ఉద్యోగుల నూతన కార్యవర్గంలో జిల్లా అధ్యక్షునిగా కొత్తచెరువుకు చెందిన సి. రామమోహన్, ఉపాధ్యక్షులుగా హిందూపురానికి చెందిన పిఒ లక్ష్మీపతి రెడ్డి, కార్యదర్శిగా ధర్మవరానికి చెందిన ఓ. రమేష్, సహాయ కార్యదర్శిగా కదిరికి చెందిన ఎస్.గంగయ్య, కోశాధికారిగా సికె పల్లికి చెందిన సుధాకర్‌ను ఎన్నుకొన్నారు.

సహాయకుల సమస్యలు పరిష్కరించాలి

పెనుకొండ : శ్రీసత్య సాయి డిగ్రీ కళాశాల లో ఆదివారం శ్రీసత్య సాయి జిల్లా గ్రామ పట్టు సహాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ భీమిరెడ్డి అంజన్ రెడ్డి , విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కమ్మన్న, వైస్ ప్రెసిడెంట్ జిఎం. శ్రీనివాసులు, కార్యదర్శులు డాక్టర్ లావణ్యలత, డాక్టర్ రామాంజనేయులు, ఆర్గనైజర్ జయరాం పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రస్తుతం గ్రామ పట్టు సహాయకులు ఎదుర్కొంటున్న సమస్యలు,ప్రస్తుత సర్వీస్ రూల్స్ సవరణ, ప్రమోషన్ చానల్స్ గురించి చర్చించారు. అనంతరం మండల స్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

సాదిక్‌పై దాడి హేయం

పెనుకొండ : గోరంట్ల పట్టణానికి చెందిన సాధిక్ అనే ముస్లిం మైనారిటీ యువకుడిపై జరిగిన దాడిని ముస్లిం ఐక్యవేదిక ఆదివారం ఖండించింది. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ రియాజ్, పెనుకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాబావలి మాట్లాడారు. సాదిక్‌పై శనివారం జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. అతను తప్పు చేసి ఉంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలే తపప పదిమంది అతని ఇంట్లోకి ప్రవేశించి మహిళలు ఉన్నారని కూడా చూడకుండా అతనిపై దాడి చేయడం అనాగరికమని అన్నారు. సాదిక్‌పై దాడి చేసిన వారి మీద క్రిమినల్ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ముస్లిం ఐక్యవేదిక డిమాండ్ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఐక్యవేదిక పట్టణ అధ్యక్షులు సనావుల్లా, ఇమ్రాన్, అయాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల సేవలు ప్రశంసనీయం

హిందూపురం : పట్టణ, గ్రామీణ పరిధిలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యా సేవలు అందించడానికి ఎల్ఆర్‌జి విద్యాసంస్థలు చేస్తున్న కృషి ప్రశంసనీయమని హిందూపురం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. విద్యాసంస్థల సెక్రెటరీ బాల సుందరం, కళాశాల ప్రిన్సిపల్ శ్రీ హరీష్ అధ్యక్షతన కిరికిరిలోని ఎల్ఆర్‌జి నాయుడు జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన వ్యవస్థాపక దినోత్సవంలో మున్సిపల్ కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, మంచి ప్రవర్తనతో విద్యార్థులు చదువుకొని భవిష్యత్తులో ఉత్తమ పౌరులై దేశానికి సేవలు అందించాలన్నారు. నాడు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించడానికి కోసం స్పిన్నింగ్ మిల్ పరిశ్రమలను స్థాపించి, ఎంతోమందికి ఉపాధి కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కోసం విద్యా సంస్థలను స్థాపించడం అభినందనీయమన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు క్రమశిక్షణతో చదివి విద్యా సంస్థలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల ఎఒ సంజీవరెడ్డి, ఎల్ఆర్‌జి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ భారతి, విద్యాలయ ప్రిన్సిపల్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ భాస్కర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా మండల కమిటీ ఏర్పాటు

పుట్టపర్తి అర్బన్ : పట్టణంలోని భక్త కనకదాసు గుడిలో కురుబ నాయకులు సమావేశమై మండల కురుబ సంఘాన్నిఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కమిటీల ద్వారా కురుబలను ఒక తాటిపై నడపడానికి వీలు ఉంటుందన్నారు. కురుబలు ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా రాణించడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. నూతన మండల కమిటీ అధ్యక్షులుగా బ్రాహ్మణపల్లి క్రిష్టప్ప, గౌరవాధ్యక్షులుగా పైపల్లి మాధవప్ప, ఉపాధ్యక్షులుగా రమేష్, కార్యదర్శిగా గోవర్ధన్ కుమార్, కోశాధికారిగా ప్రభాకర్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివానంద, శ్రీనివాసులు, రంగనాథ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కాల్చిన దుండగులను శిక్షించాలి : రాప్తాడు నియోజకవర్గం చెన్నేకొత్తపల్లి మండలంలో కురుబ సోదరుడు గోపాల్ ఆటోను కాల్చివేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కురుబ సంఘం నాయకుడు డిమాండ్ చేశారు. ఆటోనే నమ్ముకొని జీవిస్తున్న అతనికి ప్రభుత్వం ఆదుకోవాలని దుండగులను కఠినంగా శిక్షించాలని నాయకులు సామకోటి ఆదినారాయణ, శివానంద, మండల కమిటీ అధ్యక్షుడు కిష్టప్ప, ఆంజనేయులు తదితరులు డిమాండ్ చేశారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు



బత్తల హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

సమీక్షలో బీసీలకు ప్రాధాన్యత ఏదీ..?

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరిలో జరిగిన వైసిపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమీక్ష సమావేశంలో బీసీ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వలేదన్న విమర్శలు వెల్లువెత్తాయి. బిసి సామాజిక వర్గానికి చెందిన వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ కు సమావేశంలో మాట్లాడడానికి అవకాశం ఇవ్వకపోవడాన్ని బట్టి చూస్తే బీసీలకు ఇచ్చే ప్రాధాన్యత ఇదేనా అని 'బత్తల' వర్గీయులు ఆ పార్టీ నాయకుడు సంపంగి గోవర్ధన్ ప్రశ్నించారు. ఈ మేరకు సంపంగి గోవర్ధన్ మాట్లాడుతూ 30 ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన కుటుంబం నియోజకవర్గంలో 30వేల పైచిలుకు కలిగిన వడ్డెర సామాజిక వర్గం ఓట్లను ప్రభావితం చేయగలిగిన బత్తల హరిప్రసాద్‌కు సమావేశంలో మైక్ ఇవ్వకపోవడంపై ఆ సామాజిక వర్గాన్ని అవమానపరిచినట్లేనని అన్నారు. ఏది ఏమైనా వచ్చే ఎన్నికల్లో వైసిపి గెలుపునకు కృషి చేయడమే తమ లక్ష్యమని అన్నారు.

సన్మానం :కదిరి పట్టణంలో నిర్వహించిన వైసిపి విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేసినందుకు వడ్డెర,బీసీ రాష్ట్ర నాయకులు సంపంగి గోవర్ధన్ ఆధ్వర్యంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్, జగదీశ్వర్ రెడ్డి, బాహుద్దీన్‌ను ఆదివారం సన్మానించారు. ఈ సమావేశానికి వచ్చిన ఐదువేల మందికి డాక్టర్ హరిప్రసాద్ బోజన సౌకర్యం కల్పించారన్నారు.

వైసిపి పాలనలో అన్ని వర్గాలకూ అన్యాయం : టిడిపి

కదిరి టౌన్ : వైసిపి పాలనలో అన్ని వర్గాల వారకి అన్యాయం జరుగుతోందని దీంతో వారు తీవ్ర అసంతృప్తి చెందుతున్నారని టిడిపి పట్టణాధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ అన్నారు. కదిరి పట్టణంతోపాటు రూరల్ మండలం చలమకుంటపల్లి పంచాయతీలో ఆదివారం నిర్వహించిన ఇదేంఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆపల్గొన్నారు. టిడిపి మండల కన్వీనర్ చెన్నకేశవులు, మండల పరిశీలకులు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మోపురిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి హరి, యూనిట్ ఇన్‌ఛార్జి యుగంధర్, కదిరప్ప, మాజీ సర్పంచి దొడ్డప్ప, పురుషోత్తమ నాయుడు, ముత్యాల, లక్ష్మన్న, లక్ష్మన్న, చెరువు రాజశేఖర, జయచంద్ర, శ్రీనివాసులు, టి రాజు, ఆనంద్ రెడ్డి, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : మండల పరిధిలోని గుర్రం గుండ్లపల్లి, గంజివారిపల్లి, గంజివారిపల్లి ఎస్సీ కాలనీలో టిడిపి నాయకులు ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముబారక్, జయచంద్ర, శ్రీనివాసులు, నారాయణరెడ్డి, రామాంజులు, నరసింహులు, గంగరాజు, ముస్తఫా, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



ఇదేం ఖర్మ మన రాష్టానికి అనే కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి, పుట్టపర్తి అర్బన్

రాబోయే ఎన్నికలలో విజయమే లక్ష్యంగా నాయకులు కార్యకర్తలు పని చేయాలని రాష్ట్ర విద్యుత్, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పుట్టపర్తి నియోజకవర్గం విస్తతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మూడున్నర ఏళ్లలో పార్టీ మేనిఫెస్టో లో ప్రకటించిన పథకాలన్నీ అమలు చేశారన్నారు. బాబు అమరావతిలో భూములు కొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలనుకున్నారనిఅందుకే మూడు రాజధానులను వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. ఓటుకు నోటు కేసులో ఇరుక్కుని తన స్వార్థం కోసమే విజయవాడకు వచ్చారన్నారు. బాబు హయాంలో ఒక్క ప్రాజెక్టు కూడ పూర్తి చేయలేదన్నారు. జగన్ ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని అందుకు ఐక్యంగా వచ్చే ఎన్నికలలో విజయ డంకా మోగించాలని అన్నారు. సత్య సాయి జిల్లా ఏర్పాటుకు కృషి చేశామని జాతీయ రహదారులు పూర్తి చేయడానికి తగిన చర్యలు చేపట్టామని వివరించారు. పార్టీలకతీతంగా పథకాలు అందరికీ వర్తింపజేస్తున్నామన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఎన్ని జిమ్మిక్కులు చేసినా నియోజకవర్గంలో వైసిపి గెలుపును ఆపలేరని ఈసారి 50 వేలు మెజార్టీతో గెలుస్తామని జోస్యం చెప్పారు. ఉమ్మడి జిల్లాలో 14 నియోజకవర్గాల గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే శంకర్ నారాయణ, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, పార్టీ పరిశీలకులు విష్ణువర్ధన్ రెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ ఛైర్మన్లు తిప్పన్న, శ్రీ లక్ష్మీ నారాయణ రెడ్డి, కన్వీనర్లు రంగారెడ్డి, నరసరెడ్డి, నాయకులు లోచర్ల విజయభాస్కర్ రెడ్డి, కేశప్ప, మాధవరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి కదిరి టౌన్

గాండ్లపెంట మండలం వేపరాలకు చెందిన వైసిపి సానుభూతిపరులు టిడిపిలోకి చేరారు. ఆదివారం పట్టణంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛారి కందికుంట వెంకట ప్రసాద్ సమ క్షంలో వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కందికుంట వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు తెలుగు యువత హిందూపురం పార్లమెంట్ సెక్రటరీ ఆంజనేయులు సభావత్ ఆధ్వర్యంలో గాండ్లపెంట మండలం వేపరాల గ్రామం నుంచి సుమారు 15 మంది వైసీపీ నాయకులు టిడిపిలో చేరారు. పార్టీలోకి చేరిన వారిలో వీరేంద్ర, గోపాల్, బాలు, ప్రసాద్, శేఖర, వెంకటప్ప, గణేష్, ఉపేంద్ర, మోహన, అంజి, తిరుపాల్, బాలాజీ, రవీంద్ర, సోమ్ శేఖర్ తదితరులున్నారు.



పార్టీలోకి చేరిన వారితో 'కందికుంట'

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

పెనుకొండ : అనంతపురంలో ఈనెల 20 నుంచి 22వరకు జరిగే మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ కోరారు. ఆదివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ముందు జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై రాష్ట్ర మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యక్రమం రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్న వెంకటేష్, రిక్షా నరసింహులు, ఇ.వెంకటేష్, ముత్యాలు, గంగరత్నమ్మ, నాగమ్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు